క్లుప్తంగా

గాయపడిన జెడ్పీటీసీ భర్తకు పరామర్శ



తాడికొండ: గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి భర్త గుడిమెట్ల వీర్లంకయ్యను వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌ కుమార్‌ శుక్రవారం పరామర్శించారు. ఘటనపై బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎస్‌ఐ నాగార్జునకు సూచించారు.

నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

మంగళగిరి: కార్పొరేషన్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఆత్మకూరు గణపతినగర్, ఎల్బీనగర్, ఏపీఎస్పీ బెటాలియన్‌ రోడ్, శ్రీనివాసకాలనీ ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే ఆర్కే సాయంతో రిక్షాలు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఇద్దరు చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో రిక్షాలను శుక్రవారం ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయినవెంకటేశ్వరావు(డీవీఆర్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెరుకలపూడి సర్పంచి గంపల గంగాధర్, వైఎస్సార్‌ సీపీ నాయకులు నూతలపాటి కేశవరావు, జమ్ముల లోకేష్, వుయ్యూరు మారుతి, ఆళ్ల మహేష్, కర్ర్యారావు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

మంగళగిరి: కార్పొరేషన్‌ పరిధిలోని పెదవడ్లపూడికి చెందిన పలువురు చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సహకారంతో శుక్రవారం తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు అందజేశారు.

వైఎస్సార్‌ సీపీ నేతకు పరామర్శ

మంగళగిరి: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న కురగల్లుకు చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకుడు కట్టెపోగు ఉదయ్ భాస్కర్‌ను వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌ సీపీ స్టేట్ జనరల్ సెక్రటరీ అత్తోట జోసెఫ్, యువజన నాయకులు భూక్యా నాయక్, దివ్యాంగుల జిల్లా కార్యదర్శి తాడిబోయిన వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎఫ్‌సీఐలో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద శుక్రవారం మేడే మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు కంచర్ల కాశయ్య జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎఫ్‌సీఐ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ కమిటీ మెంబర్ దానబోయిన సుందరరావు, ఏఐటీయూసీ నాయకులు తుడిమెల్ల వెంకటయ్య, బత్తుల నాగయ్య, దాసు, కె.తిరుపతమ్మ, మరియమ్మ, సుధాకర్, కాశింబీ, సత్యవతి, ప్రమీల, డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

సీలింగ్, మిగులు భూములు క్రమబద్ధీకరించుకోండి

గుంటూరు వెస్ట్: సీలింగ్‌లో ఉన్న, మిగులు భూములు క్రమబద్ధీకరించుకునే అద్భుత అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తూర్పు తహసీల్దార్ పి.నగేష్ శుక్రవారం తెలిపారు. 150 చగ లోపు ఉంటే ఉచితంగా డి పట్టా, 150 నుంచి 300 వరకు బేసిక్ విలువలో 15 శాతం, 300 నుంచి 500 ఉంటే బేసిక్ విలువలో 30 శాతం, 500 కంటే ఎక్కువ ఉంటే బేసిక్ విలువలో 100 శాతం చెల్లించాలన్నారు. దారిద్ర్య రేఖ దిగువున ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. డి పట్టా 10 ఏళ్ల తర్వాత పేరు మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ కనెక్షన్, ఇంటి టాక్స్ రసీదు, నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి రసీదు ఇందులో ఏదైనా ఒక్కటి ఉంటే ఆధార్‌తో సహా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

పెదనందిపాడు/ప్రత్తిపాడు/గుంటూరు రూరల్/కాకుమాను: విజ్ఞానదాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా ఉపయోగపడుతున్నాయని, వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ ఏటుకూరు శాఖ గ్రంథాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 8 నుంచి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను దేవానంద్ పరిశీలించారు. శిబిరంలోని అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి

వాడవాడలా వర్ధంతి సభలు



కొలనుకొండలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి శుక్రవారం నియోజకవర్గంలో నిర్వహించారు. వివిధ గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరయ్య ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు.

కొలనుకొండలో....

ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య నిస్వార్థ ప్రజాసేవకుడు అని కొనియాడారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. రైతాంగ సమస్యలపైన, పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలపైన సమగ్రమైన అధ్యయం చేసిన గొప్ప దార్శనికుడు అని అన్నారు. నిజాయితీకి మారుపేరుగా నిలిచి, నిరాడంబరంగా బ్రతికి వ్యక్తి సుందరయ్య మనందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.ధనలక్ష్మి, రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, గద్దె శ్రీనివాసరావు, సురేష్, సాంబయ్య పాల్గొన్నారు.

ఉండవల్లిలో....

ఉండవల్లిలోని సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, సుందరయ్య ప్రజాసమస్యలపై చేసిన సూచనలు, ఆయన ఉపన్యాసాలు అందరి దృష్టిని ఆకర్షించే విధంగా ఉండేవని, భూమి కోసం భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, తెలంగాణాలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన సుందరయ్య తుపాకీ పట్టి జమిందారులను, రజాకర్లను తరిమి కొట్టి, భూములను పేదలకు పంపిణీ చేయించారని అన్నారు. నాయకులు ఈమని రామారావు, ఎం.భాస్కరయ్య, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, పి.రాఘవులు, రాఘవయ్య, టి.బక్కిరెడ్డి, వి.పార్థసారథి, కె.రామకృష్ణ, పి.గాంధీ, టి.శివయ్య, వి. మస్తాన్‌రావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల గ్రామ పరిధిలోని రైలుపేటలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన దుగ్గిరాల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వి.సాంబశివరావు, యల్లేశ్వరరావు, ఎస్‌కే బాషా పాల్గొన్నారు.

తాడికొండలో..

తాడికొండ: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో తాడికొండ బస్టాండ్ కూడలిలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి చింతల భాస్కరరావు మాట్లాడుతూ పుచ్చపలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శవంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కనగాల పూర్ణచంద్రరావు, జిల్లా కమిటీ సభ్యులు ఇమ్మడి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాణావత్ భద్రయ్య, పులి డేవిడ్, శ్రీనివాసరావు, సుబ్బారావు, బుల్లియ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌ కుమార్‌



మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సూచించారు. గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదలకు కూడా స్థానం కల్పించేందుకు 54 వేల పట్టాలు అందించేందుకు చిత్తశుద్ధితో ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా కుల మతాలకు అతీతంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జనరంజక పాలన కొనసాగుతుందని వివరించారు. 2024 ఎన్నికల్లో 175/175 స్థానాల్లో విజయం సాధన లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

పర్యావరణ రహిత జీవన విధానం మేలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖాధికారులు, సిబ్బంది

మోతడక(తాడికొండ): పర్యావరణ రహిత జీవన విధానంతో ఆరోగ్యానికి మేలు చేస్తుందని అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రయ్య అన్నారు. చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణ హిత జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంధన, జల వనరుల సంరక్షణ, ఈ వ్యర్థాలను తగ్గించడం, సుస్థిర ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ తిరిగి వినియోగించవద్దని, ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవర్చుకోవాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి రోజువారీ జీవితంలో సాధ్యమయ్యే మార్పులు, పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుతామంటూ విద్యార్థులతో అటవీ శాఖాధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ వీరేశలింగం నాయుడు, ఏపీసీ వేణుగోపాల్, బీట్ ఆఫీసర్లు ఎంవీ రామకృష్ణ, కె.నరసింహా రెడ్డి, షేక్ జానీ బాషా, వైస్ ప్రిన్సిపాల్ కె.కిరణ్ కుమార్, ప్రొఫెసర్ నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలువల సుందరీకరణపై అవగాహనకు కేఎల్‌యూ శ్రీకారం



కాలువలో చెత్త వేయరాదు అంటూ ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు కాలువల సుందరీకరణకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. సాక్ డైరెక్టర్ సాయి విజయ్ మాట్లాడుతూ కేఎల్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు సోషల్ ఇంటెన్షిప్‌లో భాగంగా విజయవాడలో ఉన్న వివిధ కాలువల సుందరీకరణపై అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కాలువల పరిరక్షణ, నిర్వహణ, ఆధునికీకరణపై వీధి వ్యాపారులకు, కాలువ పరిసర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. విజయవాడలోని రైవస్ కాలువ, ఏలూరు కాలువ, బందరు కాలువల సర్వే నిర్వహించారని, కాలువలో స్వచ్ఛమైన కృష్ణా నది ప్రవహించాల్సి ఉండగా స్థానికులు, ప్రయాణికులు వేస్తున్న వ్యర్థాల కారణంగా నీరు పూర్తిగా కలుషితం అయిందని సర్వేలో తెలుసుకున్నారని అన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా మరియు గోదావరి కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించామని అన్నారు. కార్యక్రమాన్ని విజయవాడ మున్సిపల్ అదనపు కమిషనర్ కె.వి. సత్యవతి హాజరై విద్యార్థులను అభినందించారు.

బాబు అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు

- వైఎస్సార్‌ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌ కుమార్‌
- తాడికొండలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: చంద్రబాబు అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీకి శాశ్వతంగా సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాడికొండ సచివాలయం -2లో శుక్రవారం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేదవాడికి సెంటు భూమి కూడా ఇవ్వకుండా జన్మభూమి కమిటీల పేరుతో తన సామాజిక వర్గానికి మాత్రం దోచిపెట్టినట్లు ఆరోపించారు. కోట్లాది రూపాయలు దాచుకున్నాడని మండిపడ్డారు. జగనన్న సంక్షేమ పాలనలో ప్రతి కుటుంబంలో ఆనందంగా ఉందని చెప్పారు. రాజధానిలో పేదలకు చోటు కల్పించి వారికి సకల వసతులతో ఇళ్ల నిర్మాణాలు చేస్తుంటే బాబును ప్రజలు ఎక్కడ మర్చిపోతారో అనే భయంతో గగ్గోలు పెడుతున్నాడని, తప్పుడు కేసులు వేయించి పేదల ఇళ్ల స్థలాలను అడ్డుకోవాలని చూసిన బాబుకు సుప్రీంకోర్టు తీర్పుతో తిక్క కుదిరిందన్నారు. కార్యక్రమంలో తాడికొండ, నిడుముక్కల సర్పంచులు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు. జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తులు నగలు దోచుకుని వెళ్లిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవాపురం రెండో లైనులో నివసించే వి.నాగమణి గురువారం ఇంటి వెనుక తలుపు గడియపెట్టి దూరంగా ఉన్న బాత్‌రూములో స్నానానికి వెళ్లింది. బాత్‌రూములో నుంచి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా, టేబులుపై పెట్టిన నల్లపూసల బంగారం గొలుసు, బంగారం నాన్‌తాడు చోరీకి గురైనట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



బాలబాలికలకు అవగాహన కల్పిస్తున్న గోళ్లమూడి శేఖర్‌బాబు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి, పెనుమాకలోని చిగురు బాలల గ్రామంలో ఉన్న పునరుతేజం విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో జీవితాన్ని అర్ధాంతరంగా ముగించవద్దని సూచించారు. వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి డీ ఎడిక్షన చికిత్స ఉందని, ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, పెజ్జోని పేటలో ఏర్పాటు చేసిన నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా 9490492020ను సంప్రదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ హెచ్‌ఆర్ మేనేజర్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ యస్ జోసెఫ్ డొనాల్డ్, జోనల్ కో ఆర్డినేటర్ బి. రమేష్ పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలి

సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని అమరావతిరోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల బాలుర వసతి గృహ సముదాయానికి మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటిలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. 1958లో నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మెడికల్ కళాశాల హాస్టల్ భవనాన్ని స్వయంగా ప్రారంభోత్సవం చేశారని శాంతమూర్తి తెలిపారు. పాత భవనం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న హాస్టల్ భవన సముదాయానికి ఆయన పేరు పెట్టి సంజీవరెడ్డికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించాల్సిందిగా కోరారు.

నీలం సంజీవరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సంజీవరెడ్డి

గుంటూరు మెడికల్: ఏపీ ముఖ్యమంత్రి, లోకసభ స్పీకర్, భారత రాష్ట్రపతి లాంటి ఉన్నత పదవులు నిర్వహించి రాజకీయాలకు వన్నెతెచ్చిన స్వర్గీయ నీలం సంజీవరెడ్డి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ 37వ డివిజన్ ఇన్‌చార్జి ఆనం సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొరిటెపాడు లైబ్రరీ సెంటర్‌లోని సంజీవరెడ్డి విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక కార్పొరేటర్ ఎక్కలూరి మారుతి కోటిలింగారెడ్డి దంపతులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై నీలం సంజీవరెడ్డి ఎన్ని ఉన్నత పదవులు అధిరోహించిన ఆర్భాటాలకు పోకుండా సామాన్య జీవితాన్ని గడిపారన్నారు. ఆయన జీవితం నేడు ప్రతి రాజకీయ నాయకునికి మార్గదర్శకమని వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్కలూరి వెంకటరెడ్డి, కంజుల శివరామిరెడ్డి, సుంకర సాంబిరెడ్డి, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

21న అన్నమయ్య గ్రంథాలయం సందర్శన యాత్ర

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలోని అన్నమయ్య గ్రంథాలయాన్ని ఈనెల 21న సందర్శించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి ఎస్.ఎం.సుభాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల ప్రకాశం జిల్లా వేటపాలెంలో 'సరస్వతి నికేతనమ్' గ్రంథాలయ సందర్శన యాత్రతో ఈ యాత్రను ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్రకు శ్రీకారం చుట్టామన్నారు.

సమన్వయంతో రహదారులు విస్తరించండి

నెహ్రూ నగర్ (గుంటూరు తూర్పు): నగరంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ పనులు ఎక్కువ కాలం సాగితే ప్రజలు ఇబ్బందులకు గురి అవుతారని, ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. విస్తరణ జరిగిన ప్రాంతా ల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మంజూరు చేయాల్సిన టీడీఆర్ బాండ్లు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇవ్వలేదని, వాటిని వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏటీ అగ్రహారం పనులు వేగంగా జరగాలని, విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. బకాయిలు చెల్లించకుండా మీడియా సంస్థలు బోర్డ్‌ల మీద యాడ్స్ పబ్లిష్ చేసుకుంటున్నారని, వచ్చే వారం రోజుల్లో డిస్‌ప్లే ఫీజులు రూ.కోటి వసూళ్ల లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ చేపట్టాలని, బకాయిలు చెల్లించని బోర్డ్ లను వెంటనే తొలగించాలని సిటీ ప్లానర్ కు స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లకు ప్రణాళిక అధికారులకు రోజువారి లక్ష్యాన్ని కేటాయించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిర్మాణదారులు ఇష్టానుసారం రోడ్ల మీద వేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి వారి నుంచి అపరాధ రుసుం వసూళ్లు చేసి, వ్యర్థాలను తొలగించాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. రీ సర్వే వేగవంతం చేయాలని, కోర్ట్ కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, కంటెమ్ట్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేసుల వారీగా ప్రతి వారం సిటీ ప్లానర్ సమీక్ష చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటి ప్లానర్లు మూర్తి, ఏతఈ పాల్గొన్నారు.

పేదలపై బాబు చేసిన వ్యాఖ్యలకు నిరసన



తాడికొండ: సెంటు స్థలం శవం పూడ్చడానికి చాలదంటూ చంద్రబాబు నాయుడు చేసిన అప్రజాస్వామిక వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. బాబు వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తాడికొండ పోలీస్ స్టేషన్ కూడలి నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలంటే మొదటి నుంచి చులకనగా చూసే చంద్రబాబు పేదలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటని చెప్పారు. బాబు వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

గుంటూరు ఈస్ట్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ మాట్లాడుతూ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి స్వర్ణ రామారావు ఈనెల 16వ తేదీన అరండల్‌పేట 6వలైనులో ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి లోపలకు వెళ్లి బయటకు రాగా ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి స్తంభాలగరువు 8వ లైనులో నివశించే నడ్డి మనోజ్‌గా ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్న విషయాన్ని తెలుసుకుని శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ హైమారావు మాట్లాడుతూ ద్విచక్రవాహనాలకు రెండో తాళం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొదటి తాళం అరిగిపోతే దాని స్థానంలో కొత్త తాళం అమర్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనం పార్కింగ్ చేసిన సమయంలో తప్పకుండా తాళం వేయాలన్నారు. పలు ద్విచక్రవాహనాల చోరీ ఘటనలో తాళలు అరిగిపోయి ఉండటం , వాహనదారుడు వాహనానికి తాళాలు లేకుండా లోపలకు వెళ్లడం వల్ల చోరీలు జరుగుతున్నాయన్నారు.

సీలింగ్, మిగులు భూములు క్రమబద్ధీకరించుకోండి

గుంటూరు వెస్ట్: సీలింగ్‌లో ఉన్న, మిగులు భూములు క్రమబద్ధీకరించుకునే అద్భుత అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తూర్పు తహసీల్దార్ పి.నగేష్ శుక్రవారం తెలిపారు. 150 చగ లోపు ఉంటే ఉచితంగా డి పట్టా, 150 నుంచి 300 వరకు బేసిక్ విలువలో 15 శాతం, 300 నుంచి 500 ఉంటే బేసిక్ విలువలో 30 శాతం, 500 కంటే ఎక్కువ ఉంటే బేసిక్ విలువలో 100 శాతం చెల్లించాలన్నారు. దార్శిద్య రేఖ దిగువున ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. డి పట్టా 10 ఏళ్ల తర్వాత పేరు మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ కనెక్షన్, ఇంటి టాక్స్ రసీదు, నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి రసీదు ఇందులో ఏదైనా ఒక్కటి ఉంటే ఆధార్‌తో సహా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.